



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680






సంపుటి : 3 | సంచిక : 316 | జులై 14 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-




# నామినేటెడ్ పదవులపై మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం

- ఒక్కో పదవికి 10 మంది పోటీ..
- పెద్ద ఎత్తున లాబీయింగ్..
- మరో ఛాన్స్ కోసం..
- ఎమ్మెల్యేలకు సైతం పదవులు..

**మన దునియా,హైదరాబాద్:జులై 13**

ఈ నెల 14న పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి హైదరాబాద్‌కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకం పై తుది నిర్ణయంనామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చెయ్యాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్ద ఎత్తున చర్చోప చర్చలు జరుగుతున్నాయి.పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తోన్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 14న పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి హైదరాబాద్‌కు రానున్నారు.

**ఒక్కో పదవికి 10 మంది పోటీ..**

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సౌకర్యం లభిస్తుంటుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్‌మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్టు పార్టీ

(మిగతా 2వ పేజీలో..)

## వియత్నాం బోటు ప్రమాదం: 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

- వియత్నాం బోటు ప్రమాదంలో 15 మంది భారతీయుల మృతి
- సోమవారం సాయంత్రం ముంబైకి చేరుకోనున్న ప్రత్యేక విమానం
- ప్రమాదానికి బాధ్యుడిగా బోటు కెప్టెన్‌ను అరెస్ట్ చేసిన వియత్నాం పోలీసులు
- గాయపడిన మరో భారతీయుడికి ఆసుపత్రిలో చికిత్స.. విజయవంతమైన వైద్య ప్రక్రియ
- మృతుల్లో ఏపీ (3), తెలంగాణ, తమిళనాడు, కేరళ వాసులు

వియత్నాంలోని ఫుక్వోక్ ద్వీపం సమీపంలో

(మిగతా 2వ పేజీలో..)



## ఇక హర్మ్యాజ్ జలసంధిని మేమే నడిపిస్తాం.. కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్

- హర్మ్యాజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే

(మిగతా 2వ పేజీలో..)

## గోవధ కేసు.. సీఎం విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట!

- ఏ రోజూ రాష్ట్రంలో ఆవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం
- ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పదేళ్లు దాటిన లేదా సంతానోత్పత్తికి పనికిరాని జంతువుల వధకు అనుమతి ఉందని వాదన
- హైకోర్టు ఉత్తర్వులకు సవరణ అవసరమన్న సుప్రీంకోర్టు

ఆవులు, దూడల వధపై మద్రాస్ హైకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలకు సుప్రీంకోర్టు సోమవారం

(మిగతా 2వ పేజీలో..)




## వానాకాలం వచ్చినా 30 పైసల పని కూడా జరగలేదు..

### మెదక్ జిల్లాలో 10కి 10 స్థానాలు బీఆర్ఎస్‌వే : హరీశ్ రావు

కరువు పరిస్థితులపై విలేకర్లు ప్రశ్నిస్తే మీ పీకలు కోసి రక్తం చల్లితే వానలు పడతాయి అని మాట్లాడుతున్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సైకో రాజ్ కుమార్‌కు ఏమైనా తేడా ఉందా..? ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటేనా ఇదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కోస్తాం, రక్తం చల్లుతాం అని హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి మీద డీజీపీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదన్నారు..పోలీసులు కండ్లు మూసుకున్నారా? చట్టం సామాన్యుడికైనా, ముఖ్యమంత్రికైనా

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా

## గోవధ కేసు.. సీఎం విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట!

(మొదటి పేజీ తరువాయి)

తాత్కాలికంగా నిలిపివేసింది. బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఏ రోజూ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం హైకోర్టు ఆదేశాల అమలుపై స్టే విధిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. 1958 తమిళనాడు జంతు సంరక్షణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టు సంపూర్ణ నిషేధం విధించిందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ చట్టం ప్రకారం 10 ఏళ్లు దాటిన లేదా వ్యవసాయం, సంతానోత్పత్తికి పనికిరాని పశువులకు సంబంధిత అధికారుల ధ్రువీకరణతో వధకు అనుమతి ఉందని ప్రభుత్వం వాదించింది. అలాంటి చట్టపరమైన వెసులుబాట్లు ఉన్నప్పటికీ అన్ని సందర్భాల్లోనూ వధను పూర్తిగా నిషేధించడం చట్ట పరిధిని మించిపోయిన చర్య అని పేర్కొంది. వాదనలు విన్న సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులకు "సవరణ అవసరం ఉంది" అని వ్యాఖ్యానించింది. దీంతో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాదుల నుంచి సమాధానం కోరుతూ విచారణను వాయిదా వేసింది. బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా ఆవులను వధిస్తున్నారని ఆరోపిస్తూ ఇందు మక్కల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, అధికారికంగా గుర్తింపు పొందిన కబేళాల్లో మాత్రమే జంతువుల వధ జరగాలని స్పష్టం చేసింది. అలాగే రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్-48ను ప్రస్తావిస్తూ ఆవులు, దూడల వధను నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు చట్టాన్ని మించిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం.. కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.



## వానాకాలం వచ్చినా 30 పైసల పని కూడా జరగలేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కటే. రేవంత్ రెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేయాలన్నారు. ఒక పక్క కరువు వస్తుంటే.. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వండయ్యా అని అడిగితే మీ పీకలు నొక్కుతా అంటున్నాడు. రిటైర్డ్ ఇంజనీర్లు మేడిగడ్డ లేకుండానే నీళ్లు లిఫ్ట్ చేయొచ్చని సలహా ఇస్తే వాళ్లను జైల్లో పెడతా అంటున్నాడు. ఇదా ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పని. రిపేర్లు చేస్తామని సింగూరు ప్రాజెక్టును ఖాళీ చేయించారు. తీరా వానాకాలం వచ్చినా 30 పైసల పని కూడా జరగలేదు. ఉన్న నీళ్లు వృధాగా పోయాయి, ఇప్పుడు తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేశారన్నారు.

**అందాల పోటీలకు వందల కోట్లు ఎక్కడివి..**

ఎన్నికల ముందు ప్రతి గింజా కొంటాం, అన్నింటికీ బోనస్ ఇస్తాం అని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడేమో కేంద్రం ఏది కొనుమంటే అదే కొంటాం, ఎంత కొనుమంటే అంతే కొంటాం అంటూ చేతులెత్తేశారని హరీశ్ రావు పేర్కొన్నారు. 20% ప్రభుత్వం కొంటే, మిగతా 80% రైతులు అడ్డికి పావుశేరు చొప్పున బయట అమ్ముకుని నష్టపోవాలా.. ఢిల్లీ చెప్పినట్లే వినడానికి ఆ ముఖ్యమంత్రి కుర్చీ ఎందుకు..? కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు అది 8 గంటలకు పడిపోయింది. రుణమాఫీ పేరుతో దేవుళ్ల మీద ఒట్లు వేసి, తీరా గెలిచాక దేవుళ్లకే శఠగోపం పెట్టారు. కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబంధు ఎగ్గొట్టారు. 30 నెలల్లో రైతులకు 19 వేల కోట్ల రూపాయల రైతుబంధు ఎగవేశారు. ఎల్ఐసీకి ప్రీమియం కట్టకుండా రైతుల బీమా ఆపేశారు. డబ్బులు లేవని చెప్పే రేవంత్ రెడ్డి.. తన మనవడి కోసం ఫుట్ బాల్ మ్యాచ్ పెట్టి వందల కోట్లు వృధా చేశాడు. ఇంట్లో పూరీలు చేసుకుంటే మాకు అభ్యంతరం లేదు కానీ.. డబ్బులు లేవంటూనే మూసీ సుందరీకరణకు, ఫ్యూచర్ సిటీకి లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నాడు. అందాల పోటీలకు వందల కోట్లు ఎక్కడివని హరీశ్ రావు ప్రశ్నించారు. బడులు తెరిచి నెల రోజులవుతున్నా పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్స్ రాలేదు. సీఎం కమీషన్ల కక్కుర్తికి ప్రభుత్వ, గురుకుల పాఠశాలల పిల్లలు అవస్థలు పడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు . 20 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ పిల్లల ఫీజు రీయింబర్స్ మెంట్ బంద్ పెట్టి వారి బతుకులను ఆగం చేస్తున్నాడని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. .

**కేసీఆర్ పథకాలన్నీ బంద్:**

ఏ స్కీం ఆగలేదు అంటున్న రేవంత్ రెడ్డి.. గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ, కేసీఆర్ కిట్, రైతుబీమా అన్నీ బంద్ పెట్టాడు. కేసీఆర్ మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తే.. నేడు నారాయణఖేడ్ లో మూడు రోజులకు ఒక్కసారి నల్లా వస్తోంది. నారాయణఖేడ్, ఆందోల్ ప్రజల సాగునీటి కోసం కేసీఆర్ గారు 'సంగమేశ్వర -- బసవేశ్వర' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే, రేవంత్ రెడ్డి ఆ పనులను బంద్ పెట్టించాడు. మూసీ ముద్దు -- బసవేశ్వర వద్దా రేవంత్ రెడ్డి. ఈ జిల్లా మంత్రి ఏం చేస్తున్నట్టు..? ఇక్కడి ఎమ్మెల్యే ఎందుకు అడగటం లేదని ప్రశ్నించారు.

**10కి 10 ఎమ్మెల్యే స్థానాలు బీఆర్ఎస్‌వే..**

బసవేశ్వరుని స్ఫూర్తితో త్వరలోనే భారీ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నామన్నారు హరీశ్ రావు. నారాయణఖేడ్ లోని బసవేశ్వర విగ్రహం నుండి సంగమేశ్వర ప్రాజెక్టు వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర చేసి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. 117 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మితే శంకరగిరి మాన్యాలు పట్టినట్టే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 9 సీట్లు కూడా గెలవదు. ఈ సారి మెదక్ జిల్లాలో 10కి 10 ఎమ్మెల్యే స్థానాలు బీఆర్ఎస్‌వేనని స్పష్టం చేశారు.

## నామినేటెడ్ పదవులపై పై మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**పెద్ద ఎత్తున లాబీయింగ్**

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్న లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్‌చార్జిల మనస్సు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైన్‌క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పని చేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

**ఎమ్మెల్యేలకు సైతం పదవులు**

ఈసారి నామినేటెడ్ పదవుల భర్తీలో ఎమ్మెల్యేలు సైతం జాబితాలో ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా ఆర్టీసీ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ లాంటి కీలక సంస్థల చైర్మన్ పదవులు ఇచ్చే చాన్స్ ఉందని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు. గతంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ పదవిని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌కు కేటాయించారు. కానీ ఆయన ఆ పదవిని తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. మంత్రి పదవి కోసం ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు కీలకమైన సంస్థలకు చైర్మన్లుగా నియమించే చాన్స్ ఉంది."ఈసారి పెద్ద మొత్తంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుంది. చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను సైతం ప్రకటించవచ్చు' అని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు.

## వియత్నాం బోటు ప్రమాదం: 15 మంది భారతీయుల మృతదేహాలు ముంబైకి తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలిస్తున్నారు. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో వారి మృతదేహాలు సోమవారం సాయంత్రానికి ముంబై చేరుకుంటాయని హనోయిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ముంబైకి చేరుకున్న తర్వాత మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మృతుల్లో అత్యధికంగా తమిళనాడుకు చెందిన 17 మంది ఉండగా, మిగిలిన వారు ఆంధ్రప్రదేశ్ (3), తెలంగాణ, కేరళ రాష్ట్రాల వారని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడి ఫుక్వోక్‌లో చికిత్స పొందుతున్న మరో భారతీయ పౌరుడికి ఆదివారం సాయంత్రం వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. మెరుగైన చికిత్స కోసం అతడిని సోమవారం హో చి మిన్ సిటీలోని ఆసుపత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులు కూడా వియత్నాం చేరుకున్నారు. మరోవైపు, ఈ దుర్ఘటనకు సంబంధించి వియత్నాం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బోటు కెప్టెన్ న్గుయెన్ హాంగ్ హై (57)ని ఆదివారం అదుపులోకి తీసుకుని క్రిమినల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించారు. ప్రమాద సమయంలో బోటులో మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు తెలిసింది. ఈ క్లిష్ట సమయంలో సహకరించిన వియత్నాం అధికారులకు భారత రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది.



# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు





**మందమర్రి ఏరియాలో ఘనంగా విజయోత్సవ వేడుకలు**

**తాడిచర్ల-2 కేటాయింపు సింగరేణి చరిత్రలోనే ఒక కీలక ఘట్టం, జీఎం ఎన్. రాధాకృష్ణ**

**మన దునియా, జులై 13,మంచిర్యాల జిల్లా**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఎస్ సి సి ఎల్) కు ప్రభుత్వం తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను నేరుగా కేటాయించడం పట్ల మందమర్రి ఏరియాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయంలో విజయోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి, సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయ యూనిట్లలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.సంస్థ సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాది:ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ సాధన సింగరేణి చరిత్రలో ఒక కీలక ఘట్టమని అభివర్ణించారు. ఈ బ్లాక్ కేటాయింపుతో సంస్థ సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని అన్నారు. రాబోయే రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పెంపునకు, ఉద్యోగ భద్రతకు మరియు కార్మిక సంక్షేమానికి ఈ బ్లాక్ ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు.?సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి అధికారి, ఉద్యోగి మరియు కార్మికుడు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కొత్త బ్లాక్ ద్వారా భవిష్యత్తు తరాలకు కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సంస్థకు దీర్ఘకాలిక స్థిరత్వం చేకూరుతుందని జీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.అన్ని విభాగాల్లో మిఠాయిల పంపిణీ:విజయోత్సవాల్లో భాగంగా మందమర్రి ఏరియా పరిధిలోని అన్ని గనులు, వివిధ విభాగాల కార్యాలయాల్లో కార్మికులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని మిఠాయిలు పంపిణీ చేస్తూ పండుగ వాతావరణాన్ని తలపించేలా సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టూ జీఎం (ఎస్ వో టూ జీఎం) జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రీమతి సరిత, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పీఓ ఆర్. సత్యనారాయణలతో పాటు జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఆఫీస్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి సమస్త పూర్వ వైభవం మా లక్ష్యం

**సింగరేణి సమస్త కు తలమానికం తాడిచెర్ల బ్లాక్ 2 గని.**

**టిఆర్ఎస్ పార్టీ కోసం బావ బామ్మర్దుల కొట్లాట.**

**రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి డాక్టర్ జి వి వెంకటస్వామి.**

**మన దునియా, జులై 13,మంచిర్యాల జిల్లా**

సింగరేణి సమస్త కు తలమానికం తాడిచెర్ల బ్లాక్ టు గని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ జి వి వెంకట స్వామి తెలిపారు. సింగరేణి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిచెర్ల బ్లాక్ 40 సంవత్సరాలు జీవిత కాలం ఉంటుందన్నారు. దీనిలో 430 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు ఉందన్నారు. దాదాపు 300 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయి అని పేర్కొన్నారు. దాదాపు 3 వేల పర్మినెంట్ ఉద్యోగాలు లభిస్తాయి అని చెప్పారు. పరోక్షంగా 50వేల మంది పైగా ఆధారపడి జీవించే అవకాశాలు ఉన్నాయి అన్నారు. ఈ బ్లాక్ కోసం నాతో పాటు నా తనయుడు పెద్ద పెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎంతగానో కృషి చేశారు. మొదటినుండి సింగరేణి సంస్థ అభివృద్ధి ఏకైక లక్ష్యంగా నూతన గనులు అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో సింగరేణి యాజమాన్యం చేత తాడిచెర్ల బ్లాక్ 2 మాతో సాధ్యం కాదని వారి అనుకూల ఏఎంఆర్ కంపెనీకి ఇవ్వడం కోసం ఎత్తు వడలు వేసారని చెప్పారు. సింగరేణి యాజమాన్యం లిఖితపూర్వకంగా రాయించేలా ఒత్తిడి తెచ్చారని చెప్పారు. పార్లమెంటులో బొగ్గు గనుల వేలం పాటలకు సంతకాలు చేశారని చెప్పారు. సింగరేణికి వచ్చి నూతన గనులు కావాలంటూ ధర్నాలు చేశారన్నారు.. సింగరేణి సంస్థ ను కోలుకోలేని విధంగా టిఆర్ఎస్ పాలనలో దెబ్బతీశారని ఆరోపించారు.. సింగరేణి నిధులన్నీ సిరిసిల్ల సిద్దిపేట గజ్వేల్ కు తరలించారు అని తెలిపారు. సింగరేణి సమస్తను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశారు అని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కి సంబంధించిన మిగతా మూడు గనులు సైతం కేటాయించాలని అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేంద్రాన్ని కోరుతాం తెలిపారు.



మందమరి ఏరియాలో గత పది సంవత్సరాల క్రితం ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసిన కేకే 6 గని కోసం కృషి చేస్తాం పేర్కొన్నారు. సింగరేణి సమస్త పూర్వ వైభవం మా లక్ష్యం. ఈ సమస్త ను తగలబెట్టాలని ఆస్తులు ధ్వంసం చేయాలని చెప్పినటువంటి ఏకైక పార్టీ బి ఆర్ ఎస్ అని తెలిపారు. దీనిని సింగరేణి ఉద్యోగులు గమనించాలి అన్నారు. ఆ పార్టీ నాయకులను గనుల డిపార్ట్మెంట్ల వద్దకు వస్తే నిలదీయాలి మండిపడ్డారు. ప్రజల సంక్షేమం పరిశ్రమల అభివృద్ధి ఏకైక లక్ష్యంగా నిరంతరం తమ ప్రజా ప్రభుత్వం పాటుపడుతుంది అన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదలకు కూర్చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు సహించలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయి అన్నారు. గతంలో మా తండ్రిగారు దివంగత కాక వెంకట స్వామి కార్మికుల సంక్షేమానికి ఎనలేని సేవలు చేసి నష్టాల ఊబిలో కోరుకుపోయినా సింగరేణి గట్టెక్కించారని లక్ష మంది ఉద్యోగులు రోడ్డున పడకుండా కాపాడాడనిచెప్పారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయించారు అని చెప్పారు. ఆయన స్ఫూర్తితో నా తో పాటు నా సోదరుడు బెల్లంపల్లి ఎమ్మెల్యే జి వినోద్ నా తనయుడు ఎంపీ గడ్డ వంశీకృష్ణ పని చేస్తున్నాము అని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి,ఎస్ఎస్ఎల్ జిల్లా అధ్యక్షుడు పైడిమల నర్సింగ్, మండల అధ్యక్షుడు కడారి జీవన్, సొత్తుకు సుదర్శన్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పడిపోతున్న భూగర్భ జలాలు.. ఆందోళనలో రైతులు

**మన దునియా,హైదరాబాద్:జులై 13**

తెలంగాణ : రాష్ట్రంలో వానలు కురవకపోవడం, రిజర్వాయర్లు అడుగంటడంతో భూగర్భజలమట్టాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. గతంలో వేసవిలో 6.22 మీటర్లు ఉండగా, ప్రస్తుతం 9.34 మీటర్లకు చేరుకుంది. 13 జిల్లాల్లో 10 మీటర్లకంటే ఎక్కువ లోతుకు చేరుకున్నాయి. గోదావరి బేసిన్‌లో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ ఆగిపోవడంతో చెరువులు, చెక్‌డ్యామ్‌లు అడుగంటుతున్నాయి. ప్రభుత్వం బరాజ్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి చెరువులు, ప్రాజెక్టులు నింపితేనే పరిస్థితి అదుపులోకి వస్తుందని అభిప్రాయపడుతున్నారు.



# మోస్ట్ వాంటెడ్ హంతకుడు ఆత్మహత్య!

**మన దునియా,హైదరాబాద్:జులై 13**



రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్.. సూసైడ్ చేసుకున్నా డు. తన మేనమామ ఊరు అయిన కొత్తూ రులోని ఓ వెంచర్ వద్ద రాజ్‌కుమార్ మృతదే హాన్ని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించగా.. రంగంలోకి దిగిన అధికారులు.. అక్కడ పరిశీలన చేశారు. ఓ బాలికపై లైంగిక వేధిం పులకు పాల్పడిన వ్యవహారంలో రాజ్ కుమార్ పోక్సో కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఈ ఘటనతో కోపం పెంచుకున్న రాజ్ కుమార్.. బాధిత బాలికతోపాటు తల్లి, నానమ్మను.. తన భార్య, ఇద్దరు పిల్లల ను కలిపి మొత్తం ఆరుగురిని ఒకే రాత్రి లో అతి కిరాతకంగా హతమార్చాడు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసుల కు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారం తో రంగంలోకి దిగిన పోలీసులు.. అక్కడికి చేరుకుని మృతుడిని గుర్తించారు. షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్ అని గుర్తించారు. రాజ్ కుమార్ మృతదేహం పక్కనే విషం బాటిల్ లభ్యం కావడంతో.. అతడు పాయిజన్ తాగి చనిపోయినట్లు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఆరుగురిని చంపేయ డంతో తనను పట్టు కునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ పడుతుండటంతో తీవ్ర భయాందోళనలకు గురై.. ఎటూ తప్పించు కుని పోయే అవకాశం లేకపోవడంతో అతడు పురుగుల మందు తాగి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక హత్యలు చేసిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిష నరేట్ పోలీసులు సుమారు 14 ప్రత్యేక బృందాలతో విస్తృతం గా గాలింపు చేపట్టా రు. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పోలీసుల గాలింపు చర్యలు తీవ్రం కావడంతో అతడికి ఎక్కడా ఆశ్రయం దొరకలేదని.. చివరికి కొత్తూరు మండలం లోని తన మేనమామ ఊరైన పంజర్లకు చేరు కున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ గ్రామ శివారులోనే పురుగుల మందు తాగి చనిపోయినట్లు పోలీసులు ధృవీకరించారు.

# ఈనెల 26 న కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం?


**మన దునియా,హైదరాబాద్:జులై 13**



తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొము రవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకు నే భక్తులకు దక్షిణ మధ్యరైల్వే త్వరలో తీపికబురు అందించ నుంది, కొమురవెల్లిలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న కొము రవెల్లి రైల్వే స్టేషన్‌ను ఈ నెల 26న కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, అధికారికంగా ప్రారంభించనున్నా రు.ప్రారంభోత్సవం జరిగిన రోజు నుంచే ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ప్రారంభం అవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుండి కొమురవెల్లి మీదుగా సిద్దిపేటకు ప్రతిరోజూ ఉదయం, మధ్యా హ్నం పూట రెండు రైళ్లు నడుస్తాయ న్నారు అదేవిధంగా తిరుగు ప్రయాణంలో సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం, సాయం త్రం వేళల్లో మరో రెం డు రైళ్లు అందుబాటు లో ఉంటాయన్నారు. భవిష్యత్తులో భక్తుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్య ను పెంచేందుకు, నిర్ణయం తీసుకుంటామన్నారు. స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయాలను మెరుగుపరిచేందుకు రైల్వే శాఖలోని మూడు విభాగాల అధికారులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రయా ణికుల అవసరాలపై దృష్టి సారించనుంది.ప్రస్తుతం ఈ మార్గంలో సికింద్రాబాద్ – సిద్దిపేట ప్యాసింజర్,డెమో రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. భవిష్యత్తులో ఈ లైన్‌ను కరీంనగర్, కాజీపేట మార్గాలకు అనుసంధానించడం ద్వారా మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపే అవకాశం ఉంది. ఈ నూతన రైల్వే లైన్ ప్రధానంగా హైదరా బాద్, మేడ్చల్– మల్కాజ్‌గిరి, సిద్దిపేట, జనగామ, కరీంనగర్ జిల్లాల భక్తులకు ఎంతగానో ఉపయోగ పడనుంది. రాజధాని నగరం సికింద్రాబాద్ నుంచి నేరుగా కనెక్టివిటీ ఉండటం తోపాటు.. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కూడా ప్రయాణం ఎంతో సులువు కానుంది. ముఖ్యంగా వీకెండ్స్, శ్రావణ మాసం, జాతరల సమయంలో ఈ జిల్లాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేని సురక్షితమైన ప్రయాణ సదుపాయం లభించనుంది.

# అక్టోబర్‌లో పీఎం కిసాన్ 24వ విడత!.. ఈకేవైసీ తప్పనిసరి

**మన దునియా,న్యూఢిల్లీ:జులై 13**



అక్టోబర్‌లో పీఎం కిసాన్ 24వ విడత!.. ఈకేవైసీ తప్పనిసరి కేంద్ర ప్రభుత్వం ఇటీవల 23వ విడత పీఎం కిసాన్ నగదును రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే, సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు ఇంకా డబ్బులు అందలేదు. ఈ సమస్యలను పరిష్కరించుకోవాలని, పీఎం కిసాన్ పోర్టల్‌లో ఈకేవైసీ పూర్తి చేయడం, బ్యాంక్ రికార్డులు సరిదిద్దుకోవడం వంటివి చేయాలని కేంద్రం సూచించింది. 24వ విడత నిధులు అక్టోబర్‌లో జమ కానున్నాయని తెలుస్తోంది. ఈ పథకం కింద ఏడాదికి రూ.6 వేలు మూడు విడతలుగా అందిస్తున్నారు. నగదు పొందాలంటే ఈకేవైసీ, ఎన్‌పీసీఐ మ్యాపింగ్, ఆధార్–బ్యాంక్ అకౌంట్ లింక్ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఇందిరమ్మ, రైతు బీమాకు సర్కార్ గ్రీన్ సిగ్నల్!

మన దునియా,హైదరాబాద్:జులై 13



తెలంగాణ : రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మెగా జీవిత బీమా పథకానికి రంగం సిద్ధం చేస్తోంది. ఏ కారణం చేత చనిపోయినా లబ్ధిదారుని కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. కొత్తగా అమల్లోకి రానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా దాదాపు కోటి మందికి, రైతు బీమా ద్వారా 37 లక్షల మందికి జీవిత బీమా రక్షణ లభించనుంది. ఈ రెండు పథకాల అమలుకు ఏడాదికి సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని అంచనా. వచ్చే ఆగస్టు 15 లోపు ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## ఆ కారణంతోనే భార్య, పిల్లల హత్య..

మన దునియా,రంగారెడ్డి:జులై 13



షాబాద్‌లో చోటుచేసుకున్న ఆరు హత్యల కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసుల దర్యాప్తులో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విడాకులు ఇవ్వమని అడిగిందన్న కారణంతోనే నిందితుడు రాజ్‌కుమార్ తన భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడని సమాచారం. తన విచ్చలవిడి జీవితానికి అడ్డువస్తుందనే కారణంతో ఆమెను అడ్డు తొలగించుకునేందుకు ముందు నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌కుమార్, సరిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. రాజ్‌కుమార్ ఇంటర్మీడియట్ చదివే సమయంలో సరిత దగ్గరకు ట్యూషన్ చెప్పించుకోవడానికి వెళ్లాడు. ప్రేమ పేరుతో ఆమెను వేధించటం మొదలెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న సరిత తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడ్డం మొదలెట్టారు. సరితను పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశంతో రాజ్‌కుమార్ వచ్చిన సంబంధాలను చెడగొట్టాడు. వయసులో తనకన్నా ఆరేళ్లు పెద్దదైన సరితను 2018లో పెళ్లి చేసుకున్నాడు. డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న రాజ్‌కుమార్.. బెట్టింగులు, జూదం వంటి వ్యసనాలకు బానిస అయ్యాడు. రెండు కోట్ల రూపాయలు అప్పులు చేశాడు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. చనిపోతానని బెదిరించటంతో అతడి తల్లిదండ్రులు కొంత పొలం అమ్మేసి అప్పులు తీర్చారు. ఆ తర్వాత తల్లిదండ్రులను నమ్మించి మొత్తం పొలం అమ్మేలా చేశాడు. జల్సాలకు, మద్యానికి బానిసైన రాజ్ కుమార్.. తరచూ మద్యం సేవించి సరితను వేధించేవాడు. రాజ్‌కుమార్ వేధింపులు తాళలేకపోయిన సరిత విడాకులు అడిగింది. దీంతో ఆమెపై పగ పెంచుకున్నాడు. శుక్రవారం రాత్రి సరితను, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు..

## ప్రభుత్వ పాఠశాలలోనే చదివి జేఎన్టీయూ లో కూడా బీటెక్ కంప్యూటర్ సైన్స్ వరకు ఫ్రీ సీట్ సంపాదించిన తల్లడి నవ్య దీపిక

**చదువులో పేదరికం లేదు అని రుజువు చేసిన తల్లి నవ్య దీపిక**

మన దునియా, వాజేడు, జూలై 13



ములుగు జిల్లా వాజేడు మండలం లోని వాజేడు గ్రామనికీ చెందిన తల్లడి నవ్య దీపిక డి/శీ శేషయ్య విద్యార్థిని మొదటి నుంచి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఆరు నుండి పదవ తరగతి వరకు ఏ హెచ్ ఎస్ స్కూల్లో పెద్ద గొల్లగూడెంలో(2019-2024) వరకు పదోవ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత రావడంతో పై చదువు కూడా సోషల్ వెల్ఫేర్ స్కూల్ వైరా గురుకులంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది ఈ2026 మార్చ్ లో జరిగిన (ఈ ఏ పి సి ఈ టి) నందు మంచి ర్యాంకు రావటంతో మొదటి రౌండు కౌన్సిలింగ్ లోనే( సిఎస్ సి) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ జేఎన్టీయూ మహబూబాద్ యూనివర్సిటీలో ఫ్రీ సీటు రావడం జరిగింది ఈ సందర్భంగా ఏ హెచ్ స్కూల్ పెద్ద గొల్లగూడెం ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు ఉపాధ్యాయుల బృందం పూనేం రోజా రాణి ,పాయం తిరుపతమ్మ, పెండేకట్ల బుచ్చిబాబు ,అట్టం రామారావు కోడి భారతి, యాలం ఉమాదేవి, గుండ్ల రాజు ,యాలం ధనలక్ష్మి, గొంది కవిత, తల్లడి నవ్య దీపికను శాలువాతో సత్కరించి స్వీట్లు ఇవ్వడం జరిగింది మా పాఠశాలలో చదువుకొని పై చదువులలో కూడా పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నందుకు మాకెంతో గర్వకారణంగా ఉందని ఉపాధ్యాయుల బృందం అన్నారు ప్రతి విద్యార్థి కూడా ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలతో దీటుగా విద్యాభ్యాసాలు నేర్పిస్తున్నాయని నవ్య దీపిక రుజువు చేసింది ఇంకా ఎందరో విద్యార్థినీ విద్యార్థులు మంచి చదువులు చదువుకొని నవ్య దీపిక లాగే మంచి ఉన్నత చదువులలో మంచి విద్యాభ్యాసించాలని అన్నారు ఒక్క బీటెక్ (సిఎస్ సి) కంప్యూటర్ సైన్స్ పేమెంట్ సీట్ తీసుకోవాలంటే ఈ సీటు విలువ మొత్తం నాలుగు సంవత్సరములకు కలిపి 20 లక్షలకు పైగా ఉంటుందని ఉపాధ్యాయుల బృందం తెలియజేశారు

# షాబాద్ హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియోలో సంచలన విషయాలు

మన దునియా,రంగారెడ్డి జిల్లా షాబాద్:జులై 13




రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరు హత్యలకు ముందు రోజు హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతని మృతదేహం వద్ద లభించిన రాజ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీడియో రికార్డు వివరాల ఆధారంగా హత్యకాండకు ముందురోజు (జులై 10న) వీడియో రికార్డు చేసినట్లు గుర్తించామని చెప్పారు. రాజ్‌కుమార్ మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోలో పలు కీలక అంశాలు ఉన్నాయని తెలిపారు. బాలికను నమ్ముకుని అన్నివిధాలా మోసపోయానని వీడియోలో అతడు తెలిపారని అన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీపీ తరుణ్ జోషీ మీడియాకు వెల్లడించారు. తాను అప్పులపాలయ్యానని ఈ వీడియోలో చెప్పుకొచ్చినట్లు సమాచారం ఉందని అన్నారు. జీవితం మీద విరక్తి చెందినట్లు నిందితుడు వెల్లడించారని తెలిపారు. తన సంపాదనలో సగం వాళ్లకే పెట్టానని.. తన దగ్గర డబ్బు వసూలు చేసి నష్టపరిచారని అతను ఆ వీడియోలో తెలిపాడని అన్నారు. తన పిల్లలకు భూమి లేకుండా చేసుకున్నానని. ఆ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యానని తెలిపారు. చివరకు కేసు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నారని వీడియోలో రాజ్‌కుమార్ రికార్డ్ చేశారని సీపీ తరుణ్ జోషీ వెల్లడించారు.బాలికతో పాటు ఐదుగురిని హంతుకుడు రాజ్‌కుమార్ హత్య చేశాడని సీపీ తరుణ్ జోషీ తెలిపారు. 11 నుంచి 12 గంటల మధ్యలో ఆరు హత్యలు జరిగాయని చెప్పుకొచ్చారు. రాజ్‌కుమార్ కారును అద్దెకు తీసుకున్నాడని తెలిపారు. ఈ ఘటన జరిగిన రోజు పదిన్నర గంటలకు ఊర్లోకి అతను వచ్చాడని అన్నారు. అమ్మాయిని తీసుకుని దేవరకొండకు వచ్చాడని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటు ఉండటంతో నిందితుడు 16 సిమ్ కార్డులు వాడాడని అన్నారు. నిందితుడికి రూ.2 కోట్లకుపైగా అప్పు ఉందని వెల్లడించారు. దానివల్ల మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని చెప్పారు. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఆ బాలికను వేధించాడని అన్నారు. అతనిపై పోక్సో కేసు ఉందని.. తాజాగా ముందస్తు బెయిల్ వచ్చిందని వెల్లడించారు. రూ.2 వేలకు కారు అద్దెకు తీసుకుని ఆరుగురి హత్యలకు వినియోగించాడని చెప్పుకొచ్చారు. షాబాద్‌లో బాలిక నాన్నమ్మను చంపి అక్కడ నుంచి ఆమెను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని సీపీ తరుణ్ జోషీ తెలిపారు. అక్కడ బాలిక, తన భార్యను, పిల్లలను నిందితుడు చంపేశాడని వెల్లడించారు. 11:37లకు తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని రాజ్‌కుమార్ చెప్పాడని తెలిపారు. ఒంటిగంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఈ ఘటన తర్వాత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని వెల్లడించారు. జీపీఎస్ ఆధారంగా రాజ్‌కుమార్‌ని పట్టుకునేందుకు యత్నించామని చెప్పారు. క్లూస్ టీం సభ్యులు మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారని అన్నారు. ఎన్నిగంటలకు రాజ్‌కుమార్ చనిపోయాడనేది క్లారిటీ లేదని తెలిపారు. క్లూస్ టీమ్ అధికారులు అతని మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారని అన్నారు. పెంజర్లలో రాజ్‌కుమార్ మేనమామ ఉన్నారని తెలిపారు. నిందితుడికి సంబంధించిన నలుగు ఫ్యామిలీలు ఈ గ్రామంలోనే ఉంటున్నాయని సీపీ తరుణ్ జోషీ పేర్కొన్నారు..

# ఆకాశం నిండా మేఘాలు.. పడని వర్షాలు!

**మేఘాలు వస్తున్నాయి.. పోతున్నాయి..**
**ఇంకా రైతుల గుండెల్లో ఆశలు**
**దోబూచులాటతో అన్నదాతల గుండెల్లో గుబులు**

మహబూబాబాద్/కొత్తగూడ:జులై 13




ఆకాశం నిండా కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి.. కానీ ఆశించిన వర్షం మాత్రం కురవడం లేదు. వరుణ దేవుడు కరుణిస్తాడని కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది . మేఘాలు వస్తున్నాయి.. పోతున్నాయి.. కానీ చుక్క నీరు రాల్చడం లేదు. అయినప్పటికీ, ఎప్పటికైనా వర్షం పడకపోతుందా, తమ పొలాలు పచ్చగా మారకపోతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ఆకాశం వైపు చూస్తే కారుమబ్బులు ముసురుకుంటున్నాయి. త్వరలోనే వర్షం పడుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. కానీ తీరా సమయానికి ఆ మేఘాలు కాస్తా గాలికి కొట్టుకుపోతున్నాయి. వాతావరణం చల్లబడుతుందే తప్ప.. భూమిని తడిపేలా ఒక్క వాన చుక్క కూడా రాలడం లేదు. ఈ దోబూచులాటతో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది.సాధారణంగా ఈపాటికే ముసురు పట్టి, వాగులు వంకలు పొంగిపొర్లాలి. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా మారింది. రుతుపవనాలు వచ్చినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. విత్తనాలు చల్లేందుకు, నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు.. ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. పెట్టుబడులు పెట్టి, అప్పులు తెచ్చి సిద్ధం చేసుకున్న భూములు ఎండకు ఎండిపోతుంటే వారి గుండె తరుక్కుపోతోంది.అయినప్పటికీ.. రైతు గుండెల్లో ఆశ చావడం లేదు. “ఈ రోజు కాకపోతే రేపైనా వరుణుడు కరుణించకపోతాడా.. తమ కష్టాలు తీర్చకపోతాడా” అనే నమ్మకంతోనే బతుకుబండిని లాగుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశల పల్లకీపైనే కాలం వెళ్లదీస్తున్నారు. మబ్బులున్నా కురవని వానలు ఒకవైపు.. గుండెల్లో గుబులు పెడుతున్నా వదలని ఆశలు మరోవైపు. వరుణ దేవుడు ఇప్పటికైనా కరుణించి, అన్నదాతల కళ్లల్లో ఆనందం నింపాలని కోరుకుందాం.

## అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై సీబీఐ విచారణ జరపాలి:

**వి.హనుమంతరావు**

మన దునియా,హైదరాబాద్ 13

కేంద్రంలో ధృతరాష్ట్ర పాలన సాగుతోందని బీసీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు విమర్శించారు. రాముడు నడయాడిన భద్రాద్రి రామాలయం వద్ద అయోధ్య రామాలయం నిధులు గోల్ మాల్ పై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ మౌన దీక్ష చేశారు.అయోధ్య రామాలయం నిర్మాణానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు సమర్పించారని, అది ప్రజల డబ్బు అని అన్నారు. ప్రజలు సమర్పించిన బంగారం కరిగించి అయోధ్య ట్రస్ట్ అమ్ముకుందని ఘాటు విమర్శ చేశారు. తిరుపతిలో లడ్డు, నెయ్యి కుంభకోణం జరిగితేనే సీబీఐ విచారణకు ఆదేశించారని, అయోధ్యలో వందలాది కోట్ల రూపాయల కుంభకోణం జరిగితే ఎందుకు సీబీఐ విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు.



అయోధ్య ట్రస్ట్ బోర్డులో ఉన్నవారు అందరూ బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ కు చెందినవారెనని.. వారిని కాపాడేందుకు యోగి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ఈనెల 19న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్నట్లు, దీక్షలో రాహుల్ గాంధీ పాల్గొంటారని ప్రకటించారు. అంతకు ముందు భద్రాచలం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం




# నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి





● ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం

**మన దునియా,ములకలపల్లి:జులై 13**

ములకలపల్లి:జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా ములకలపల్లి మండలం లో మూకమామిడి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నులిపురుగు నివారణ కొరకు కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ప్రారంభించి పాఠశాలలోని విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు స్వయంగా అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవ సందర్భంగా పిల్లల భవిష్యత్తు ఆరోగ్యాన్ని ఉద్దేశించి ఈ కార్యక్రమం చేపట్టాం అని నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత,బలహీనత,చదువుపై శ్రద్ధ తగ్గుతుంది.కాబట్టి ప్రతి విద్యార్థి తప్పనిసరిగా మాత్ర వేసుకోవాలి అని అన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యం పరిశుభ్రత పాటిస్తే నులిపురుగుల బారి నుండి కాపాడుకోవచ్చు అని పిల్లల ఆరోగ్యం బాగుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుంది అని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తెలిపారు.అనంతరం సిక్ రూములో జ్వరంతో ఉన్న విద్యార్థులను పరామర్శించి,బలహీనంగా ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి తెలిపారు.ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని తరగతుల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ విజయ్ కుమార్,మూకమామిడి ఆరోగ్య సెంటర్ సిహెచ్ఓ పూజ ప్రసన్న,ఏఎన్ఎం అనిత,ఆశ వర్కర్లు బచ్చల పద్మ,కణితి జయ,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలు రాకుండా రోడ్లు వెడల్పు చేసి,అండర్ పాస్‌లు నిర్మించాలి.

**కొత్తపల్లి శివ కుమార్ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి**

**మన దునియా,సూర్యాపేట జిల్లా:జులై 13**



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావాలంటే రోడ్లను నాలుగు లేన్లుగా మార్చాలని, హైవే దగ్గర రెండు అండర్ పాస్ లు నిర్మాణం చేయాలని కోరుతూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకత్వం కలెక్టర్ గారికి డిమాండ్ లతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం జిల్లా కేంద్రం అయినా తర్వాత నలువైపులా దిన దినం అభివృద్ధి చెందుతూ జనాభా పెరుగుతున్నది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణంలో రోడ్ల విస్తరణ జరగక పోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే కుడకుడ రోడ్, ఖమ్మం రోడ్ అంబేద్కర్ విగ్రహం నుండి చివ్వెంల హైవే వరకు,ఎంజీ రోడ్డు గాంధీ బొమ్మ నుండి కుసుమవారి గూడెం వరకు నాలుగు లేన్లుగా రోడ్డు విస్తరణ చేపట్టాలని అన్నారు. రోడ్ నిర్మాణంలో నష్టపోయిన వారికి మార్కెట్ ధరకు మూడు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం రోడ్డు,60 ఫీట్ల రోడ్డు ను కలుపుతూ అండర్ పాస్ నిర్మాణం చేయాలని,హైటెక్ బస్టాండ్ నుండి బస్సులు రాంగ్ రూట్ లో రావడం, హైవే వద్ద యు టర్న్ చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని అందుకే హైటెక్ బస్టాండ్ దగ్గర మరో అండర్ పాస్ నిర్మాణం చేస్తే సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ గారిని కోరారు.తక్షణమే జిల్లా మంత్రి గారు, స్థానిక ఎమ్మెల్యే, అధికార పార్టీ నాయకులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్ పాల్గొన్నారు.

# పొనకల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణ

**ఖానాపూర్ ఆర్సి మన దునియా జన్నారం; జూలై 13:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (National Deworming Day) సందర్భంగా జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మ-భూమేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమక్షంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ-భూమేష్ విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి వాటిని తీసుకునేలా చేశారు. పిల్లల్లో నులిపురుగుల నివారణ ద్వారా ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని ఆమె తెలిపారు. ఈరోజు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేని పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా తప్పనిసరిగా మాత్రలు అందించి వేయించాలని ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, వార్డు సభ్యుడు మద్రిపల్లి అంజన్న, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అమరావతిలో ఎకరం భూమి ధర ఎంతో తెలుసా.. ప్రభుత్వ రేటు ఎకరా రూ.2.40 కోట్లు




**మన దునియా,ఆంధ్రప్రదేశ్:జులై 13**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎకరా భూమి ధర ఎంత?. తాజాగా ఏపీ ప్రభుత్వం సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మానానికి సంబంధించి రైతులకు చెల్లించిన పరిహారంతో ఆసక్తికర విషయాలు తెలిశాయి. అమరావతికి సీడ్ యాక్సెస్ రోడ్డు చాలా కీలకంగా మారింది.. కొంతకాలంగా భూసేకరణకు సంబంధించి కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి. తాజాగా ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న ఒక్క అడ్డంకి తొలగిపోయింది. ఈ రోడ్డుకు సంబంధించి అవసరమైన 2.77 ఎకరాల భూమికి సీఆర్డీఏ అవార్డు పాస్ చేసింది.. అధికారులు ఈ భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారు.ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డుకు సంబంధించి భూమిని స్వాధీనం చేసుకునే సమయంలో.. భూమి యజమానులు అడ్డుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయగా ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఓ మహిళ మహిళా ఎస్సైపై చేయిచేసుకున్నా పోలీసులు మాత్రం సంయమనం పాటించారు. ఓ మహిళకు సంబంధించిన భూమిలో ఉన్న రేకుల షెడ్డును తొలగిస్తుండగా.. కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లారు. ఎట్టకేలకు భూమిని స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో.. ఆ భూమిని చదును చేసే పనులు చేపట్టారు. దాదాపు నాలుగు గంటల పాటూ ఈ భూమి స్వాధీనం ప్రక్రియ కొనసాగింది. అలాగే ఇప్పటికే ప్రకటనలు ఇచ్చిన గ్రామాల్లో కూడా అవార్డు నోటీసులిచ్చి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఉండవల్లిలో సీడ్‌యాక్సెస్ రోడ్డుకు సంబంధించిన భూమి అంశం ఎప్పటి నుంచో పెండింగ్ ఉంది. పదిమంది రైతులు ఈ భూమిని భూసమీకరణ కింద ఇవ్వలేదు.. దీంతో అధికారులు మొత్తం 2.77 ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకున్నారు. ఈ మేరకు ఈ భూమికి సంబంధించి రూ.7.14 కోట్ల సొమ్మును తీసుకోవడానికి రైతులు నిరాకరించారు. దీంతో అధికారులు ఆర్అండ్ఆర్ కోర్టులో ఈ డబ్బుల్ని జమ చేసి.. భూమిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఉండవల్లిలో ఎకరాకు రూ.2.40 కోట్ల చొప్పున భూసేకరణ నిబంధనల ప్రకారం పరిహారం జమ చేశామని తెలిపారు. దీన్ని బట్టి అమరావతిలో ఎకరా రూ.2.40 కోట్లు ఉందనే చర్చ జరుగుతోంది.

# విద్యారంగంపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలి

● బీజేపీ రాష్ట్ర కో కన్వీనర్, తీకుళ్ళ సాయిరెడ్డి.

**మన దునియా,హైదరాబాద్:జులై 13**



రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి నేడు అన్నింటిని గాలికి వదిలిందని బీజేపీ రాష్ట్ర టీచర్స్ సెల్ కో కన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు.అధికారంలోకి రాగానే పి.ఆర్సి ఇస్తామని, ఒక్క డిఎ కూడా పెండింగ్ లో లేకుండా ఇస్తామని, సి పి ఎస్ రద్దు చేసి ఓపిఎస్ ఇస్తామని, అందరికీ హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఏ పని చేయలేదు.పైపెచ్చు లేని హెల్త్ కార్డ్స్ కు నెల నెల జీతంలో కోతలు విదిస్తూ ఖజానా నింపుకోవడం,ఆఖరికి పెన్షనర్స్ వద్దనుండి కూడా అంతటా వర్తించే హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండానే పెన్షన్లో 1.5% పెన్షన్ మినహాయించుకోవడం అత్యంత శోచనీయం. ఇప్పటికే గత రెండు సంవత్సరాల క్రితం ఉపాధ్యాయ ఉద్యోగవిరమణ పొందిన వారికి కూడా నేటివరకు వారికి న్యాయంగా చెందాల్సిన బకాయిలను ఇవ్వకపోవడం ప్రభుత్వం దివాలాకోరు తనానికి నిదర్శనం. ప్రభుత్వం చర్యలు వల్ల నేటికీ సుమారు వంద మందికి పైగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు అసువులు బాశారు. ఒకరకంగా చెప్పాలంటే ఇవ్వన్నీ ప్రభుత్వం హత్యలే!!కేంద్ర ప్రభుత్వం గత జనవరి వరకు ఉన్న అన్ని డి ఎ లు ఉద్యోగులకు చెల్లించింది. మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వడంలేదు.కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని, రాష్ట్ర ముఖ్యమంత్రే విద్యామంత్రి కూడా అయినందున విద్యా రంగం పట్ల నిర్లక్ష్య దోరనిని విడనాడి ఉపాధ్యాయుల,విద్యారంగం సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులకు పి ఆర్ సి వర్తింప చేయాలని, సి పి ఎస్ రద్దుచేయాలని , పెండింగ్ డి ఎ లు, 2024 జూన్ నుండి రిటైర్ అయ్యిన ఉపాధ్యాయులకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, విద్యాశాఖలో కాళీగా యంఇఓ, డి.డి.ఇ.ఓ, డిఇఓ, ప్రమోషన్స్ కల్పించి ఇంచార్జిల పాలనకు స్వస్తి పలుకాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు అందాల్సిన ఫీజురీఎంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# సింగరేణిలో దుస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ లే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:జులై 13**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు.సింగరేణి సంస్థ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వాల వైఖరిపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు గనుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండా సింగరేణికి కేటాయించిన ఏకైక బొగ్గు గని తాడిచర్ల–2 బ్లాక్ అని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్–8 నాణ్యమైన బొగ్గు లభిస్తుందని, మరో 40 నుంచి 50 సంవత్సరాల పాటు సింగరేణికి అవసరమైన బొగ్గు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తాడిచర్ల–2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కూడా మోదీ ప్రభుత్వమే సింగరేణికి కేటాయించిందని గుర్తు చేశారు.సింగరేణి సమస్యలపై తాను అనేకసార్లు ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్రానికి వివరించానని చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి



కారణమని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కేటాయింపుపై కేసీఆర్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సింగరేణికి ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు పెట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి

- **జూలై 15న ఇందిరాపార్క్ మహాధర్నాను విజయవంతం చేయాలి : సిపిఎం**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; జూలై 13:**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ విగ్రహం సమీపంలో సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కనికరపు అశోక్, జన్నారం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశంగా భారత్ ఉన్నప్పటికీ యువత సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి వినియోగించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయలేదన్నారు. అలాగే బీజేపీ ప్రభుత్వం 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ 12 ఏళ్లు గడిచినా ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రం వేలాది మంది యువత త్యాగాలు, నిరుద్యోగుల ఆత్మబలిదానాల ఫలితంగా ఏర్పడిందని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల విషయంలో నిరుద్యోగులను తీవ్రంగా నిరాశపరిచిందన్నారు. పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాలు, కోర్టు



వివాదాలతో యువత భవిష్యత్తు దెబ్బతిన్నదని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకుండా, కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు యువత, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ, పి. కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



# నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ భరత్ కుమార్



**మన దునియా, వాజేడు, జూలై 13**

ములుగు జిల్లా వాజేడు మండలం ఉమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని ఎం పి యు పి ఎస్ స్కూల్ లో నులిపురుగుల నివారణకు టాబ్లెట్ ఆల్బెండజోల్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ భరత్ కుమార్ మరియు ఏ ఎన్ ఎం లలిత, ఆశా వర్కర్ శివ ,కుమారి హెచ్ఎం గిరి ప్రసాద్,నాగార్జున రాజు ,ఉపాధ్యాయుల బృందం పాల్గొనడం జరిగింది

# తిమ్మాపూర్ ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజును అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్ జన్నారం మండల కమిటీ

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; జూలై 13:**




మంచిర్యాల్ జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన బాధాకరమని ఎమ్మార్పీఎస్ జన్నారం మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజు, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన ఖంపెల్లి సువర్ణతో పాటు అదే కుటుంబానికి చెందిన విద్యార్థిని ఖంపెల్లి గంగోత్రిపై వారి ప్రమేయం లేకుండానే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వల్ల వారు తీవ్ర మానసిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన ఆరోపించారు. ఈ ఘటన వారి గౌరవానికి భంగం కలిగించేలా జరిగిందని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, ఆరోపణలు నిజమని తేలితే ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రాజును వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జన్నారం మండల కమిటీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లింగంపల్లి రాజలింగం, రాజన్న, ఉపసర్పంచ్ ఈర్నాల గంగన్న, మోతే పురుషోత్తం, మర్చిపోల శ్రావణ్ కుమార్, గడ్డం రవి, బుడగ జంగాల సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ–రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# టీమిండియాతో వన్డే సిరీస్... తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ జట్టు ప్రకటన

**బెన్ డకెట్‌తో కలిసి జాకబ్ బెథెల్ ఓపెనింగ్**

**వికెట్ కీపర్ జాస్ బట్లర్‌కు ఇది 200వ వన్డే**

**ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్న ఇంగ్లండ్**

**వన్డే జట్టులోకి తిరిగి వచ్చిన పేసర్ జోఫ్రా ఆర్చర్**




భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతూ ఇంగ్లండ్ యాజమాన్యం ఆశ్చర్యకర నిర్ణయం తీసుకుంది. సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ వికెట్ కీపర్–బ్యాటర్ జోస్ బట్లర్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం కానుంది. అతను తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. ఇంగ్లండ్ వైట్–బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఉన్న బట్లర్, 2012 ఫిబ్రవరి 21న దుబాయ్‌లో పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన 199 మ్యాచ్‌లలో 39.11 సగటుతో 5,515 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతను ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 21 వన్డేలు ఆడిన యువ డైనమిక్ ప్లేయర్ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేయడం వెనుక బలమైన కారణమే ఉంది. బెన్ డకెట్‌కు సరైన భాగస్వామిని కనుగొనాలనే ఇంగ్లండ్ ప్రయత్నాలు దీని ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ తర్వాత డకెట్‌కు ఐదో ఓపెనింగ్ భాగస్వామిగా బెథెల్ నిలవనున్నాడు. ఇది ఓపెనింగ్ స్థానంపై ఇంగ్లండ్ జట్టులో నెలకొన్న అస్థిరతను సూచిస్తోంది. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి బలమైన భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లతో దాడి చేయాలని నిర్ణయించుకుంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ మోయనున్నారు. ఇటీవల టీ20 సిరీస్‌లో అదరగొట్టిన ఆర్చర్, గతేడాది నవంబర్ తర్వాత తొలిసారిగా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. దీంతో గస్ అట్కిన్సన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఇరు జట్లు జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న లార్డ్స్‌లో మూడో వన్డేలో తలపడనున్నాయి.

తొలి వన్డేకు ఇంగ్లండ్ తుది జట్టు:

జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.

# భారత అమ్మాయిల చారిత్రక ఘనతపై సచిన్ టెండూల్కర్ స్పందన

**లార్డ్స్‌లో తొలి మహిళల టెస్టులో భారత్ చారిత్రక విజయం**

**హర్మన్‌ప్రీత్ సేనపై ప్రశంసలు కురిపించిన సచిన్ టెండూల్కర్**

**యాస్తిక సెంచరీ, క్రాంతి ఐదు వికెట్ల ప్రదర్శన అద్భుతమన్న సచిన్**

**మహిళల క్రికెట్‌లో ఇదొక అందమైన ముందడుగు అని వ్యాఖ్య**

లార్డ్స్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా మహిళల క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా జరిగిన మహిళల టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సేన గెలవడం ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించాడు. మహిళల క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ చివరి రోజున సచిన్ స్వయంగా మైదానంలో ఉండి విజయాన్ని వీక్షించాడు. ఆట ప్రారంభానికి ముందు సచిన్ భారత మహిళా క్రికెటర్లతో మాట్లాడాడు. ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన అనంతరం, సచిన్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నాడు. "ప్రతి క్రికెటర్‌కు లార్డ్స్‌లో ఆడాలనే కల ఉంటుంది. గత నాలుగు రోజులుగా, తొలిసారిగా ఇక్కడ మహిళల టెస్ట్ క్రికెట్ జరగడంతో కొత్త తరం క్రీడాకారిణులు ఆ కలను సాకారం చేసుకున్నారు" అని సచిన్ పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన సచిన్, కీలక క్రీడాకారిణుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. "వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నిలకడ, యాస్తిక భాటియా అద్భుతమైన సెంచరీ, పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల ప్రదర్శన ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అని కొనియాడాడు. 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ జట్టును 186 పరుగులకే ఆలౌట్ చేసి భారత్ ఈ చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో యాస్తిక భాటియా లార్డ్స్‌లో సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా, క్రాంతి గౌడ్ ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించారు. "మహిళల క్రికెట్ ప్రయాణం అద్భుతంగా సాగుతోంది, ఇది ఆ ప్రయాణంలో మరో అందమైన ముందడుగు" అంటూ సచిన్ తన పోస్ట్‌లో కితాబిచ్చాడు.



## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు నామినేషన్లలో శుభ్‌మన్ గిల్




జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2–1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు, న్యూజిలాండ్ పేసర్ నాథన్ స్మిత్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి 2–1తో సిరీస్ గెలవడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనలతో ఇద్దరూ జూన్ నెల ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు రేసులో చోటు దక్కించుకున్నారు.

## లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన టీమిండియా... ఏకైక టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తుచేసిన హర్మన్ ప్రీత్ సేన

లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానంలో భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. 142 ఏళ్ల లార్డ్స్ చరిత్రలో జరిగిన మొట్టమొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఆఫ్‌స్పిన్నర్ స్నేహ్ రాణా (4/42) అద్భుత బౌలింగ్‌తో చెలరేగగా, దీప్తి శర్మ (2/36) ఆమెకు చక్కటి సహకారం అందించింది. భారత స్పిన్నర్ల ధాటికి ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 186 పరుగులకే కుప్పకూలింది. దీంతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు క్రికెట్ మక్కాలో చిరస్మరణీయ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 457 పరుగుల అసాధ్యమైన లక్ష్య ఛేదనతో సోమవారం నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్, 130/6 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగింది. ఓటమిని తప్పించుకోవాలన్న ఇంగ్లండ్ ఆశలు ఆ జట్టు బ్యాటర్ అమీ జోన్స్‌పైనే ఆధారపడ్డాయి. అయితే, ఆట ప్రారంభమైన మూడో ఓవర్‌లోనే స్నేహ్ రాణా అద్భుతం చేసింది. ఆమె వేసిన బంతిని పుల్ చేసిన అమీ జోన్స్ (54), మిడ్–వికెట్ వద్ద ఉన్న షఫాలీ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇసీ వాంగ్, సోఫీ ఎక్లెస్టోన్ దాదాపు 10 ఓవర్ల పాటు వికెట్ పడకుండా అడ్డుకున్నా, పరుగులు చేయడంలో విఫలమయ్యారు. ఈ భాగస్వామ్యాన్ని దీప్తి శర్మ విడదీసింది. ఆమె వేసిన అద్భుతమైన బంతికి ఇసీ వాంగ్ క్లీన్ బౌల్డ్ అయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో సోఫీ ఎక్లెస్టోన్ ఒంటరి పోరాటం చేసింది. క్రాంతి గౌడ్, దీప్తి శర్మ బౌలింగ్‌లో బౌండరీలు బాది స్కోరు బోర్డును ముందుకు నడిపింది. అయితే, లారెన్ బెల్‌ను దీప్తి శర్మ బోల్తా కొట్టించడంతో ఇంగ్లండ్ 159 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సోఫీ తన తొలి టెస్టు హాఫ్ సెంచరీని 61 బంతుల్లో పూర్తి చేసుకుంది. కానీ, అద్భుతంగా బౌలింగ్ చేసిన స్నేహ్ రాణా, సోఫీ ఎక్లెస్టోన్‌ను (50) క్లీన్ బౌల్డ్ చేసి భారత చారిత్రక విజయాన్ని ఖరారు చేసింది. ఈ చరిత్రాత్మక విజయంలో స్నేహ్ రాణాతో పాటు ఇతర భారత క్రీడాకారిణులు కూడా అద్భుత ప్రదర్శన చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో యస్తికా భాటియా (113) అద్భుత సెంచరీతో చెలరేగింది. లార్డ్స్ మైదానంలో టెస్టు సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌లలో (83, 70) హాఫ్ సెంచరీలతో రాణించగా, రిచా ఘోష్ కేవలం 52 బంతుల్లోనే 50 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా, ఇంగ్లండ్ 170 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 341/7 వద్ద డిక్లేర్ చేసింది. ఈ విజయంతో, గత 11 టెస్టుల్లో భారత్‌కు ఇది ఏడో గెలుపు కాగా, ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో తమ అజేయ రికార్డును కొనసాగించింది. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వంటి ప్రముఖుల సమక్షంలో ఈ విజయం దక్కడం విశేషం. ఈ చారిత్రక విజయంతో రెడ్ బాల్ క్రికెట్‌లో భారత మహిళల జట్టు తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. గత 11 టెస్టుల్లో భారత్ ఏడు విజయాలు, మూడు డ్రాలు సాధించి, కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఓడిపోయింది. ఇంగ్లాండ్ గడ్డపై భారత మహిళల జట్టుకు ఇది 11వ టెస్టు కాగా, ఆ దేశంలో ఈ ఫార్మాట్‌లో మన జట్టుకు ఇప్పటి వరకు ఓటమన్నదే లేదు. 3 మ్యాచ్ ల్లో గెలిచిన భారత అమ్మాయిలు, 8 మ్యాచ్ లు డ్రా చేసుకున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## రాముడిగా మహేశ్, రావణుడిగా ఎన్టీఆర్: వైరల్ అవుతున్న 'రామాయణం' ఏఐ ట్రైలర్



కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన 'రామాయణం' ఫ్యాన్ మేడ్ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియోలో శ్రీరాముడిగా మహేశ్ బాబును, రావణుడిగా జూనియర్ ఎన్టీఆర్‌ను చూపించడంతో నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణ్' చిత్ర అధికారిక ట్రైలర్ విడుదల కావడానికి కొద్ది రోజుల ముందే ఈ ఏఐ వీడియో వెలుగులోకి రావడం విశేషం.ఓ యూట్యూబ్ ఛానెల్ రూపొందించిన ఈ ట్రైలర్‌లో మహేశ్ బాబు (రాముడు), జూనియర్ ఎన్టీఆర్ (రావణుడు), కీర్తి సురేశ్ (సీత), జాన్వీ కపూర్ (మండోదరి)లను ఏఐ పరిజ్ఞానంతో అత్యంత సృజనాత్మకంగా ఆవిష్కరించారు. ముఖ్యంగా సీతాపహరణం సమయంలో రాముడి వేదనను, పరమ శివభక్తుడిగా రావణుడిని చూపించిన తీరు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.వాస్తవానికి, నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ్' చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే సాయి పల్లవి బాలీవుడ్ అరంగేట్రం చేస్తుండటం గమనార్హం. అలాగే హనుమంతుడిగా సన్నీ డియోల్, మండోదరిగా కాజల్ అగర్వాల్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు ఈ భారీ ప్రాజెక్టును సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్ర మొదటి భాగాన్ని 2026 దీపావళి కానుకగా విడుదల చేయనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. హాలీవుడ్ దిగ్గజం సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఒకవైపు అసలు చిత్రంపై ఉత్కంఠ నెలకొనగా, మరోవైపు తమ అభిమాన నటులను ఈ పౌరాణిక పాత్రల్లో ఊహించుకుంటూ అభిమానులు చేస్తున్న ఏఐ ప్రయోగాలు నెట్టింట ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## 'లెనిన్'పై మెగాస్టార్ ప్రశంసలు.. అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడన్న చిరంజీవి

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల నుంచి ప్రశంసల వెల్లువ కొనసాగుతోంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి కూడా చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఆయన సోషల్ మీడియా వేదికగా 'లెనిన్' యూనిట్‌ను అభినందిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.'లెనిన్' చిత్రంపై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఈ విషయం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక సినిమా విజయం సాధించడమే కాకుండా, అందరి నుంచి గొప్ప ప్రశంసలు అందుకోవడం మరింత సంతోషాన్నిచ్చే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయం సందర్భంగా చిత్రబృందం మొత్తానికి ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యంగా అఖిల్ అక్కినేని నటన గురించి చిరంజీవి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "అఖిల్ నాకు మరో కొడుకులాంటి వాడు. ప్రతి సినిమాతో నటుడిగా మరింత పరిణతి సాధిస్తూ, ఎదుగుతున్న అతడిని ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది" అంటూ మెగాస్టార్ ప్రశంసలు కురిపించారు. ఈ భారీ విజయం అఖిల్ కెరీర్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి నాంది కావాలని ఆకాంక్షించారు. అలాగే, తన చిరకాల మిత్రుడు నాగార్జునకు కూడా చిరంజీవి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అక్కినేని కుటుంబానికి ఇంతటి ఆనందాన్ని అందించిన ఈ విజయం వెనుక ఉన్న ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులని అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు, కథానాయిక భాగ్యశ్రీ బోర్సే, నిర్మాతలు, ఇతర సాంకేతిక నిపుణులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.అయితే, తాను ఇంకా 'లెనిన్' చిత్రాన్ని చూడలేదని, ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చూశాక సినిమా చూడాలనే ఆసక్తి మరింత పెరిగిందని చిరంజీవి వెల్లడించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని చూస్తానని పేర్కొన్నారు. బాక్సాఫీస్ వద్ద 'లెనిన్' ఇదే విజయ పరంపరను కొనసాగించి మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి చేసిన ఈ పోస్ట్‌తో మెగా, అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# "నాకిద్దరు కూతుళ్లు ఉన్నారు.. ఉద్యోగం ఇవ్వండి".. తండ్రి కష్టాలను గుర్తుచేసుకున్న భాగ్యశ్రీ బోర్సే



లెనిన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపింది.ఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది.తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. "నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి" అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది.ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ పోతినేని వంటి హీరోలతో నటించింది. ఇటీవల అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com